క్లుప్తంగా

చర్చిల స్థలాలపై రెవెన్యూ అధికారుల విచారణ



చర్చిల స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు, సిబ్బంది

నర్సీపట్నం : సీబీఎం కాంపౌండ్‌లో ఉన్న చర్చిల స్థలాలపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. తహసీల్దార్ రామారావు, ఆర్ఐ నాయుడు, సర్వేయర్ వెంకటేశ్వరరావు మంగళవారం సీబీఎం కాంపౌండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్థలాలు ఆక్రమణకు గురైనట్టు పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో వి.వి.రమణ ఫిర్యాదు అందిందని, ఈ మేరకు ఆర్డీవో ఆదేశాలతో విచారణ చేపట్టామన్నారు. చర్చిలకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్ ఆధారాలు సమర్పించాలని నిర్వాహకులను ఆదేశించామన్నారు. గృహాలు నిర్మించుకున్న వారు, ఖాళీ స్థలాలకు సంబంధించిన హక్కు పత్రాలను ఇవ్వాలని సూచించామన్నారు. వాటి ఆధారంగా డిజిటల్ సర్వే చేయించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న నాయుడు తదితరులు

మాడుగుల : కింతలి గ్రామంలో మంగళవారం సాయంకాలం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొలుత స్వయం సేవక్ పతాక ఆవిష్కరణ చేసి రూట్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ జి.పి. నాయుడు మాట్లాడారు. 1925 విజయ దశమి రోజున ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్‌కు 100 ఏళ్లు పూర్తయిందన్నారు. ఈ సంఘం దేశంలో హిందూ పరిరక్షణతో పాటు అనేకమైన సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రముఖ్ జి.జగదేశ్వరరావు మాట్లాడారు. దేశ ప్రజల్లో జాతీయభావం పెంపొందించడంలో ఆర్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల క్రార్యవాహ్ ఉండూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పాడి రైతులకు పశుదాణా బేసిన్లు పంపిణీ



పాడి రైతులకు బేసిన్లను అందజేస్తున్న డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి విశాఖ డెయిరీ పాల సొసైటీ-3 లోని సభ్య రైతులకు పశుదాణా బేసిన్లను డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ మేరకు యూనిట్ మేనేజర్ జి.ఎస్.వి.అప్పారావు, సూపర్‌వైజర్ జగ్గారావు, స్థానిక సొసైటీ అధ్యక్షుడు నందారపు అయ్యప్పనాయుడు, ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు సమక్షంలో బేసిన్లను అందజేశారు. కార్యక్రమంలో వేతన కార్యదర్శి పెంటకోట శ్రీను, సలాది కొండలరావు పాల్గొన్నారు. అలాగే మారేపల్లిలోని పాలసొసైటీ-1లోని సభ్య రైతులకు పశు దాణా బేసిన్లను డైరెక్టర్ గంగాధర్ అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ తెనుగుపూడి, మారేపల్లి పాల సంఘాలలోని 330 మంది సభ్య రైతులకు పశు దాణా బేసిన్లు అందజేశామని తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఎంతో ఊరట



సమావేశంలో మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి

మాడుగుల: విద్యాకమిషనర్ ఆదేశాల మేరకు సూపర్ జీఎస్టీ సూపర్‌సేవింగ్ అని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సివిఎస్ఎస్ శాస్త్రి అన్నారు. విద్యాకమిషనర్ ఆదేశాల మేరకు వాణిజ్యశాస్త్రం, అర్థశాస్త్ర విభాగాలు సంయుక్తంగా జీఎస్టీ 2.0 పై విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ 2.0 నిర్ణయం వల్ల పేద మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలుజరుగుతుందన్నారు. గృహోపకరణాలు అనునిత్యం వినియోగించే వస్తువుల ధరలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, వాణిజ్యశాస్త్ర ఉపన్యాసకులు అంబేడ్కర్‌రాజు, అర్థశాస్త్ర ఉపన్యాసకులు ఎస్.పుల్లారావు పాల్గొన్నారు.

హోల్‌సేల్ మార్కెట్ వద్ద ట్రాఫిక్ చర్యలు

దేవరాపల్లి: దేవరాపల్లిలో హోల్‌సేల్ కాయగూరల మార్కెట్ వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రోడ్డుపై కాయగూరలు విక్రయిస్తుండడంతో తరుచూ వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్న దృష్ట్యా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా కళాశాల ప్రహరీకి ఆనుకొని కూరగాయలను విక్రయించుకోవాలని రైతులకు సూచించామన్నారు.

యంత్రాలతో సస్య రక్షణ

- డ్రోన్‌లతో పురుగుమందుల పిచికారీ
- రైతులకు ఎంతో సౌలభ్యం



మాడుగుల మండలం సత్యవరంలో డ్రోన్‌తో పిచికారీ చేయడానికి సిద్ధం చేస్తున్న దృశ్యం



స్ప్రేయింగ్ పంపుతో వరి చేలకు పురుగు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

మాడుగుల : వరి చేలకు తరుచూ తెగుళ్లు రావడం వల్ల పురుగు మందులు పిచికారీ చేయడానికి అదును కుదరడం లేదని, రైతులు చెబుతున్నారు. గత నెల రోజుల నుండి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం వల్ల ఖరీఫ్ వరి చేలుకు భారీగా తెగుళ్లు ఆశిస్తున్నాయని చెబుతున్నారు. పురుగు మందులు పిచికారీ చేయడానికి వర్షాలు వల్ల అదును కుదరక మందులు పిచికారీ చేయలేకపోతున్నారు. ప్రస్తుతం డ్రోన్‌లు అందుబాటులోకి వచ్చాయి. 3 ఎకరాలు దాటి ఉంటే డ్రోన్‌తో పిచికారి చేసుకోవడం వల్ల పురుగు మందు మంచు తుపరులుగా ఆకులపై పడుతుంది. కేలీలతో స్ప్రే చేయించినా ఎకరాకు రూ.300 తీసుకుంటారు. డ్రోన్‌తో కూడా ఎకరాకు రూ.300 ఖర్చు అవుతుంది. ఇక్కడ కూలీలు అందుబాటులో లేకపోవడంతో పాటు ఎకరా పొలానికి పిచికారీ చేయాలంటే కూలీలకు కనీసం 4 గంటలు పడుతుంది. అదే డ్రోన్‌తో 10 నిమిషాలు పడుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మండలంలో పలుచోట్ల డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేపడుతున్నారు. వర్షాల కారణంగా డ్రోన్‌తో పిచికారీ చేయించడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాకవరపాలెంలో ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు



సీహెచ్‌వో హేమ సుందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సత్యవతి,ఆశాలు

మాకవరపాలెం: ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు నాయకుడు ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. స్థానిక పీహెచ్‌సీ ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, ప్రభుత్వ సెలువులను వీరికి కూడా వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. 20 ఏళ్లుగా వీరు సేవలు అందిస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యలపై మరింత ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాకవరపాలెం, బూరుగుపాలెం పీహెచ్‌సీల పరిధిలోని ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రావికమతం: ఆశా వర్కర్ల న్యాయపరమైన కోరికలను నెరవేర్చాలని మండలంలో గల ఆశాలు రావికమతం,కొత్తకోట పీహెచ్‌సీల వద్ద మంగళవారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఆశ యూనియాన్ ప్రధాన కార్యదర్శి వి.సత్యవతి మట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, అన్ని రకాల ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని, దహన సంస్కారాల ఖర్చు రూ.20 వేలు ఇవ్వాలని, రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదు..తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం రావికమతం పీహెచ్‌సీ వద్ద సీహెచ్‌ఓ హేమసుందర్‌కు, కొత్తకోట పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌వో పి.రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రావికమతం పీహెచ్‌సీ యూనియన్ సభ్యులు వై.లక్ష్మి, దేవి, సంధ్య, శంకరి,, కొత్తకోట పీహెచ్‌సీ యూనియన్ సభ్యులు పి.వెంకట పుష్ప, ఎస్.రత్నం, బి.భవానీ, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయండి



కిల్లాడ శ్రీనివాసరావు

నర్సీపట్నం: ఈ నెల 9న మాకవరపాలెంలోని మెడికల్ కాలేజీ సందర్శనకు విచ్చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయా లని నర్సీపట్నం నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు పేర్కొన్నారు. విద్యార్థిని, విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు తరలిరావాలన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమానికి సంఘీభావం తెలియజేయాలన్నారు.

వైఎస్ జగన్ పర్యటనకు తరలిరండి

చోడవరం: ఈనెల 9వతేదీన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్న కార్యక్రమానికి చోడవరం నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పాడేరు, అరకు నియోజకవర్గాల అదనపు పరిశీలకుడు ఏడువాక సత్యారావు కోరారు. నర్సీపట్నం మండలంలో జగన్‌మోహన్‌రెడ్డి పర్యటిస్తారని, అక్కడ మెడికల్ కాలేజీని పరిశీలిస్తారని సత్యారావు చెప్పారు.

పర్యటన జయప్రదం చేయండి



ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్

మాడుగుల: మాడుగుల మండలం 29 పంచాయతీల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ నెల 9వ తేదీన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు అనకాపల్లి కొత్తూరు కాలేజీ జంక్షన్‌కు తరలి రావాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్కడ నుంచి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాళ్లపాలెం మీదుగా మాకవరపాలెం మెడికల్ కాలేజీకి చేరుకుంటారన్నారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరై కార్యక్రమం విజయవంతం చేయడానికి పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు.

వైభవంగా నల్లకొండమ్మతల్లి పండగ



తాండవలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



నాతవరంలో దర్శనానికి క్యూలో భక్తులు

నాతవరం: మండలంలో రెండు పంచాయతీల్లో నల్లకొండమ్మ తల్లి పండగ భక్తులు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. తాండవ రిజర్వాయరు గట్టు దిగువన ఉన్న పురాతన అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే నాతవరం గ్రామంలో వెలసిన నల్లకొండమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. పండగ సందర్భంగా తాండవ, మాధవనగరం గ్రామాల్లో విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. నాతవరంలో గుర్రాల పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహకాలు, నగదు, షీల్డు అందజేశారు.నాతవరం ఎస్ఐ వై.తారకేశ్వరరావు బందోబస్తు ఏర్పాటు చేసారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి



గుమ్మడిగొండలో అవగాహన కల్పిస్తున్న మండల అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి

నాతవరం : అడవిలో సంచరించే జంతువులను వేటాడడం, చంపడం చట్ట రిత్యా నేరమని నాతవరం మండలం అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి అన్నారు. మండలంలో గుమ్మడిగొండ, వెదురుపల్లి, కొమి గ్రామాల్లో మంగళవారం జంతువులను సంరక్షించడంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ముందుగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మండల వ్యాప్తంగా గ్రామసభలు అవగాహన సదస్సులు నిర్వహించి వన్యప్రాణుల సంరక్షణ గురించి వివరించడం జరుగుతుందన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి జంతువులను వేటాడితే అటవీ చట్టం ప్రకారం ఎటువంటి చర్యలు ఉంటాయో వివరించారు. అడవులతో పాటు వన్యప్రాణులు రక్షించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వెదురుపల్లి, పెడిమికొండ, నాతవరం అటవీ బీట్ ఆఫీసర్లు నాగరాజు, లోవరాజు, మహంతి పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌కు స్వచ్ఛ అవార్డు



జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ సంధ్యారాణి



స్వచ్ఛ స్కూల్ అవార్డును కలెక్టర్ నుండి అందుకుంటున్న ప్రిన్సిపాల్ చిన్నమ్మలు.

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం, వేములపూడి ఏపీ మోడల్ స్కూల్‌కు స్వర్ణాంధ్ర,స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 6న జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ చేతుల మీదగా ప్రిన్సిపాల్ సంధ్యారాణి అవార్డును అందుకున్నారు. స్వచ్ఛత, పరిశుభ్రతను పాటించినందుకు ఈ పాఠశాలను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. స్కూల్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్న పాఠశాల శానిటేషన్ సిబ్బంది, ఆయాలు, ఆఫీస్ అవుట్‌సోరింగ్ సిబ్బందిని ఆమె అభినందించారు. క్వాలిటీ ఎడ్యుకేషన్‌తో పాటు స్కూల్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలు అవార్డు వచ్చేందుకు ఉపకరించాయన్నారు.

కె.కోటపాడు : స్వచ్ఛ ఆంధ్ర-2025 అవార్డులలో భాగంగా స్వచ్ఛ స్కూల్ విభాగంలో జిల్లా స్థాయిలో కె.కోటపాడు మండలంలో కింతాడ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు అవార్డు వరించింది. పాఠశాలలో పరిశుభ్రత, పరిసరాల పచ్చదనం అంశాలను ఉన్నతాధికారులు గుర్తించి పాఠశాలను స్వచ్ఛ స్కూల్ అవార్డుకు ఎంపిక చేశారు. అనకాపల్లిలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా అవార్డును కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు స్వీకరించారు. పాఠశాలకు స్వచ్ఛ స్కూల్ అవార్డు రావడం పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా శ్రీ గౌరీ పౌర్ణమి ఉత్సవాలు



శివుడికి పూజలు చేస్తున్న అఘోరాలు

రోలుగుంట : గౌరీపరమేశ్వర్ల ఉత్సవాన్ని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి పోతల లక్ష్మీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, పోలిరెడ్డి నర్సింహమూర్తి కుటుంబ సభ్యులతో కలసి పట్టువస్త్రాలను సమర్పించుకొని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం కమిటీ వారు భక్తులతో కలిసి ఆలయంలో నుంచి ఉత్సవమూర్తులను భుజాలపై మోసుకొచ్చి రథంపైకి తీసుకొచ్చారు. ఊరేగింపు జరిపారు. శివుడికి అఘోరాలు పూజ చేస్తూ చేసిన నాట్య ప్రదర్శన, డప్పు వాయిద్యం, చిడతల ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. సోమవారం ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా సంక్రాంతి వరకూ పూజా కార్యక్రమాలు జరుగుతాయని, అలాగే ప్రతి రోజూ రాత్రిపూట పలు వేషాలతో నాటికలు(వాలకాలు) ప్రదర్శించడం జరుగుతుందని గ్రామస్తులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఉత్సవ కమిటీ చైర్మన్ పోతల లక్ష్మీ శ్రీనివాస్ కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు

రావికమతం : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు అన్నారు.కొత్తకోట సర్కిల్ కార్యాలయం ఆవరణలో కొత్తకోట శ్రీ శాంతి ఆటో యూనియన్ సభ్యులతో మంగళవారం అవగాహన కల్పించారు.ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రస్తుత రోడ్ల పరిస్థితి బాగోలేనందున ఆటోలను జాగ్రత్తగా నడపాలని వేగం కంటే ప్రాణం ముఖ్యమని గ్రహించాలన్నారు. కొత్తకోట, రోలుగుంట తదితర గ్రామాల ముఖ్య కూడలిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సహకరించాలని తెలిపారు. ముఖ్యంగా సభలు, సమావేశాలకు జనాన్ని తరిలించేందుకు పోలీసు వారి అనుమతులు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండగ్రామాలకు విద్యుత్ పునరుద్ధరిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

నర్సీపట్నం : నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని నీళ్లబంధ, సొంపురంబందకు బుధవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు తెలిపారు. దినపత్రికల్లో వార్తలు వచ్చే వరకు విద్యుత్ సరఫరా లేదన్న విషయం సిబ్బందికి తెలియదన్నారు. ఈ రెండు గిరిజన గ్రామాలు ఎత్తయిన కొండపై ఉన్నాయన్నారు. యంత్రాలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తరలించడానికి అవకాశం లేనందున, మనుషులతో ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలిస్తున్నామన్నారు. బుధవారం సాయంత్రానికి గిరిజన గ్రామాలకు విద్యుత్‌ను పునరుద్ధరిస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు.

రోలుగుంట: గిరిజన గ్రామాల్లో కాలిపోయిన ట్రాన్స్‌ఫారం తొలగించి కొత్త ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాలని కోరుతూ రోలుగుంట మండలం ఆర్ల పంచాయితీ శివారు నీలబంద,రావికమతం మండలం సోంపురం బంద గ్రామాల్లో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించి మంగళవారం కొత్త ట్రాన్స్‌ఫారంను గిరిజన గ్రామాలకు తీసుకొచ్చి విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న యువజన సంఘం సభ్యులు

రావికమతం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి తగలబెట్టడం, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గావాయిపై దాడి వంటి ఘటనలకు నిరసనగా కొత్తకోటలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం రాత్రి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. రాజ్యాంగం రచించి దేశానికి దశ, దిశని నిర్దేశించిన అంబేద్కర్ లాంటి వ్యక్తిని అవమానించడం, విగ్రహాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టడం హేయమైన చర్య అని, సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్ గవాయిపై కోర్టు హాల్లోనే న్యాయవాది దాడి చేయడం అమానుషమని అంబేద్కర్ సంఘ ప్రతినిధులు బుంగా బుల్లిబాబు, ఎంపీటీసీ సభ్యులు పూడి దేవా, పూడి అప్పారావు అన్నారు. ఆయా దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేసారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పూడి అర్జున్, యూత్ సభ్యులు ప్రసాద్, నాగరాజు, శివ, నేతాజీ, రాము పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్రమశిక్షణతో ఎంతో మేలు



తొలి బ్యాచ్ ఎన్‌సీసీ విద్యార్థులతో కల్నల్ నీరజ్‌కుమార్

కె. కోటపాడు: ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ఎన్‌సీసీ శిక్షణ, క్రమశిక్షణ ఎంతగానో ఉపయోగపడతాయని 13 వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ అన్నారు. స్థానిక అయ్యన్న విద్యాసంస్థలకు నూతనంగా ఎన్‌సీసీ యూనిట్ మంజూరైన నేపథ్యంలో ఎన్‌సీసీ యూనిట్‌ను నీరజ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ పరంగా కూడా ఎన్‌సీసీ దోహదపడుతుందని ఎన్‌సీసీపై అవగాహన కల్పించారు. దేశ వ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ ఉన్నారని తెలిపారు. అయ్యన్న విద్యాసంస్థల్లో మొదటి బ్యాచ్ విద్యార్థులు ఎంతో శ్రద్ధ, క్రమశిక్షణతో మెరుగుగా శిక్షణ పొందాలని ఆకాంక్షించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసీం, డాక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ సుమతి, ఎన్‌సీసీ పీవో చల్లా పైడినాయుడు, హవల్దార్ సుజన్‌సింగ్, హరిక, శేఖర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

గొల్లపేటలో ఖాళీ బిందెలతో నిరసన



తాగునీటి కోసం బిందెలతో గ్రామస్తుల ధర్నా

రోలుగుంట : కొత్తూరు పంచాయతీ శివారు గొల్లపేట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ గ్రామంలో 250 జనాభాకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా 10 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకును నిర్మించారు. దీనికి రూ. 22 లక్షలు వ్యయం చేశారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన ఈ వాటర్ ట్యాంకు ద్వారా రెండు రోజులు మాత్రమే నీరు సరఫరా చేసారని, ఏడాది నుంచి నీరు రాలేదని గ్రామస్తులు తెలిపారు. బోరు, షెడ్డు నిర్మించారని, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారని, నీరు మాత్రం రాలేదని తెలిపారు. గ్రామంలో గల బోరు నుంచి కలుషిత నీరు వస్తుందన్నారు. దీనిపై అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించలేదని పేర్కొన్నారు. సమస్య పరిష్కరించకపోతే ఎంపీడీవో కార్యాలయం వద్ద బిందెలతో ఆందోళన చేపడతామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు పేర్కొన్నారు. ఈ నిరసనలో చిరంజీవి, గొల్లపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పాడి ఆవు మృతి

బుచ్చెయ్యపేట : ఆర్.భీమవరం గ్రామంలో మంగళవారం సాయంత్రం వర్షం పడినపుడు పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందింది. రొంగలి చిన్నంనాయుడుకు చెందిన పాడి ఆవు పిడుగుపాటుకు గురైనపుడు ఆ శబ్దానికి చిన్నంనాయుడు అక్కడ నుంచి దూరంగా వెళ్లిపోవడంతో అతనికి ప్రాణాపాయం తప్పింది. మృతి చెందిన పాడి ఆవుకు గ్రామస్తులతో కలిసి చిన్నంనాయుడు అంత్యక్రియలు నిర్వహించారు.

చోడవరం పరిసరాల్లో భారీ వర్షం



చోడవరంలో భోరున కురుస్తున్న వర్షం

చోడవరం : రోజూ కురుస్తున్న వర్షాలతో పంట పొలాలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. ఈ అకాల వర్షం వరి పంటకు కొంత మేర నష్టం కలిగించింది. చోడవరం పరిసరాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురిసింది. చెరకు తోటలకు కొంత మేలు చేసినప్పటికీ వరి పంటకు నష్టం కలిగింది.

గొలుగొండ: గొలుగొండ పరిసర ప్రాంతాలు అయిన చిన్నయ్యపాలెం,దారపాలెం, అనంతసాగరం, కొత్తపాలెం, పాతమల్లంపేట, నిమ్మగెడ్డ,గదబపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడం జరిగింది. ధారకొండపై కురిసిన వర్షం కారణంగా ధారగెడ్డ, బోరింగ్‌గెడ్డల నుంచి నీరు ప్రవహించి తాండవ జలాశయానికి చేరింది.

దోమల ద్వారా ప్రబలే వ్యాధులపై అప్రమత్తం

మాకవరపాలెం : దోమల ద్వారా సోకే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వరహాలదొర సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నిత్యం గ్రామాల్లో వైద్య సిబ్బంది మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు.

మస్తిష్క పక్షవాతంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు

రావికమతం: ప్రపంచ సెరిబ్రల్ పాల్సీడే (మస్తిష్క పక్ష వాత) సందర్భంగా ఆ వ్యాధిపై మంగళవారం మేడివాడ హైస్కూల్ విద్యార్థులకు హెచ్ఎం రామారావు ఆధ్వర్యంలో భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథనాయుడు అవగాహన కల్పించారు. సెరిబ్రల్ పాల్సీ వైకల్యం అనేది గర్భిణులకు ప్రసవ సమయంలో ఎదురయ్యే సమస్యల వల్ల, చిన్నప్పుడే మెదడులో నరాలు దెబ్బతినడం వల్ల, మేనరిక వివాహాల వల్ల సంభవిస్తుందని అన్నారు. ఈ వైకల్యానికి గురైన వ్యక్తులు కూర్చోవడం, పాకడం,నడవడంలో ఇబ్బంది పడతారని ప్రాథమిక దశలోనే వీరిని గుర్తించి చికిత్స అందిస్తే మేలు జరుగుతుందని తెలిపారు.

బ్రిడ్జి నిర్మించి బస్సులను పునరుద్ధరించాలి



దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: దేవరాపల్లి-కొత్తవలస మార్గంలో శిథిలమైన బ్రిడ్జిని తక్షణమే నిర్మాణం చేపట్టి బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులతో కలిసి మంగళవారం నిరసన చేపట్టారు. శిథిలమైన బ్రిడ్జిని నిర్మించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం కృష్ణారాయుడుపేట వద్ద శిథిలమైన బ్రిడ్జిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువపై ఉన్న బ్రిడ్జి శిథిలమవ్వడంతో విశాఖ నుంచి కొత్తవలస మీదుగా దేవరాపల్లి వచ్చే బస్సులు రాకపోకలు నిలిచిపోయాయని, తద్వారా ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు నరకయాతన పడుతున్నారని తెలిపారు. కృష్ణారాయుడుపేట సమీపంలోని శిథిలమైన బ్రిడ్జి వద్ద బస్సులు ఆగిపోవడంతో కొత్తవలస వెళ్లే ప్రయాణికులంతా ఆటోల్లో చేరుకోవాల్సి వస్తుందన్నారు. బ్రిడ్జి శిథిలమై మూడు నెలలు కావస్తున్నా ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంఘాల పోరాటాల ఫలితంగా జీవిఎంసీ అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి రూ. 91 లక్షలు మంజూరు చేసి టెండర్ పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ రావడం లేదని అధికారులు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యుద్ధప్రాతిపదికన బ్రిడ్జి నిర్మించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.